అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 28 ఏప్రిల్ 2023

సాలాపూర్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-బాసర

మండలంలోని సాలాపూర్ గ్రామంలో గురువారం అంబేద్కర్ 132 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ జన నియోజకవర్గ ఇంచార్జీ సర్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ అందరివాడని, ఆయన దూరదృష్టి వల్లనే చిన్న రాష్ట్రాల ఏర్పాటయ్యాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం చిత్తశుద్ధితో ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవ్‌రావు పటేల్, మాజీ సర్పంచ్ సాహెబ్‌రావు పటేల్, జనార్దన్, గంగాధర్, రవి, గౌతం, సంజీవ్, సురేష్, విఠల్‌రావు పటేల్, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు, లక్ష్మీకాంత్, రాజశేఖర్, వరుణ్, వర్ధన్, వంశీ, సిద్ధార్థ, అనికేత్, భూమయ్య, రాజేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలి

నిర్మల్ : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. పట్టణ సీఐ మల్లేష్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని, లైసెన్స్ లేని 45మంది వాహనదారులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం లైసెన్స్‌లేని 10 మంది వాహనదారులకు లెర్నింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయించారు. అలాగే వాహనదారుల పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. అనంతరం ఎస్సై దేవేందర్ మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

- కాసిపేట, పల్లంగూడలో సీసీ కెమెరాలు ప్రారంభం



నవతెలంగాణ - కాసిపేట

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కాసిపేటలో మూడు, పల్లంగూడలో మూడు సీసీ కెమెరాలను సీఐ ఎస్ఐలు విజయేందర్, గంగారాంతో కలిసి వేర్వేరుగా గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకొని అందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని గ్రామాలను నేరరహితంగా ఉంచుకోవాలని సూచించారు. కాసిపేటలో ఎంపీటీసీ అక్కెపల్లి లక్ష్మీ, సర్పంచ్ ధరావత్ దేవి, ఉప సర్పంచ్ పిట్టల సుమన్, రత్నం ప్రదీప్, జమున, పల్లంగూడలో సర్పంచ్ దుస్స విజయ, ఎంపీటీసీ చంద్రమోళి, దుస్స చందు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో అక్రమ వెంచర్లు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నస్పూర్, తీగల్‌పహాడ్, సీతారాంపల్లిలోని ఎనిమిది వెంచర్లలో హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నస్పూర్ పట్టణంలో అక్రమ లేవుట్‌లో ప్రజలు ప్లాట్స్ కొని మోసపోవద్దన్నారు. ఎవరైన కొంటే వారికి మున్సిపల్ నుండి గృహ నిర్మాణ అనుమతులు ఇవ్వబోమని తెలిపారు. ఎవరైనా అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకొని వెంటనే తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ సతీష్, వార్డు ఆఫీసర్‌లు ప్రభాకర్, రమేష్, నర్సిములు, బిల్ కలెక్టర్ శ్రీపతి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి



నవతెలంగాణ - హాజీపూర్

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజేష్ భూషణ్ మహిళా రెజ్లర్స్‌పై లైంగిక వేధింపులకు నిరసనగా డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ చెప్తున్న భేటి పడావో భేటీ పడావో అంటే ఇలా మహిళలను వేధించడమేనా? అని ప్రశ్నించారు. ఉన్నతమైన పదవిలో ఉండి ఇలా చేయడం అంటే యావత్ సమాజం సిగ్గుపడేలా ఉందని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం నేరస్తునికి అండగా ఉంటుందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులను ప్రభుత్వం పట్టించుకోకపోగా నేరస్తున్ని కాపాడే ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. తక్షణమే రెజ్లింగ్ క్రీడాకారులకు న్యాయం చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

క్రీడా ప్రాంగణం ప్రారంభం



నవతెలంగాణ-భీమిని

చిన్నతిమ్మాపూర్ గ్రామంలో గురువారం అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి తెలంగాణా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. యువకులతో వాలీబాల్ ఆడారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పిచ్చిగడ్డిని వారం లోపు తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. చిన్న తిమ్మాపూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీని సందర్శించి మొలకెత్తిన బెడ్స్‌లలో వెంటనే వేరే విత్తనాలు వేయాలని పంచాయతీ కార్యదర్శిని, వనసేవకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరి భూమయ్య, మండల పంచాయతీ అధికారి శేఖ్ సఫ్దర్ అలీ, ఏపీఓ భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉప సర్పచ్, వార్డు సభ్యులు ఇందూరి కిషన్, కోట లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు ఇందూరి నాగయ్య, సోంశెట్టి శంకర్ పాల్గొన్నారు.


సమ్మె బాటలో పంచాయతీ కార్యదర్శులు..!

- నేటి నుంచి విధులు బహిష్కరించి నిరసన
- పల్లెల్లో నిలిచిపోనున్న రోజువారీ కార్యకలాపాలు
- క్రమబద్ధీకరించే వరకు పోరాటం కొనసాగించాలని నిర్ణయం

పంచాయతీ కార్యదర్శులు సమ్మె బాటపట్టారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి ఈ నెల 13న సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ గడువు శుక్రవారంతో ముగియడం.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన వెలువడకపోవడంతో నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 882మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించనున్నారు. దీంతో పల్లెల్లో రోజువారీ అభివృద్ధి పనులు, కార్యకలాపాలకు ఆటంకం కలగనుంది. వీరు విధుల్లో లేకపోవడంతో గ్రామాల్లో సుమారు 43 రకాల పనులకు అంతరాయం కలగనుంది. ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీనివ్వడమే కాకుండా అధికారికంగా జీఓ వచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని కార్యదర్శులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు వీరు సమ్మెకు వెళ్లడంతో అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని భావిస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెల సమగ్రాభివృద్ధి కోసం పరితపిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పట్ల ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. వీరి నాలుగేండ్ల ప్రొహిబేషన్ పీరియడ్ ఈ నెల 11వ తేదీకే పూర్తయినా.. ఉద్యోగాలను క్రమబద్ధీకరించే అంశం తేల్చడం లేదు. జీఓ నెం.26 ప్రకారం ప్రొహిబేషన్ పూర్తయిన మరుసటి రోజు నుంచి గ్రేడ్-4 కార్యదర్శులుగా పరిగణించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు చేయడం లేదు. ఇది వరకే ఆయా జిల్లాల వారీగా సమ్మె నోటీసు అందించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గురువారం మరోసారి సమస్యను ఆయా జిల్లాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వానికి పంచాయతీ కార్యదర్శులు నిర్దేశించిన గడువు శుక్రవారంతో ముగియనుండగా.. సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు వెలువడ లేదు. దీంతో జేపీఎస్‌లు తొలుత నిర్ణయించిన ప్రకారమే సమ్మె బాటపట్టాలని నిర్ణయించారు. తొలి రోజున కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిరసన నిరవధిక దీక్ష చేపట్టిన మరుసటి రోజు నుంచి క్లస్టర్ల వారీగా లేదంటే మండలాల వారీగా ఎక్కడికక్కడ నిరసన తెలపాలని భావిస్తున్నారు.



సమస్యలపై జడ్పీ చైర్మెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

నిలిచిపోనున్న కార్యకలాపాలు

ఉమ్మడి జిల్లాలో 1485 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 882మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ జిల్లాలో 283మంది, నిర్మల్‌లో 247మంది, మంచిర్యాలలో 181మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 171మంది జేపీఎస్‌లు పనిచేస్తున్నారు. నాలుగేండ్ల ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తికాగానే వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ఇది వరకే హామీనిచ్చిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కాలయాపన చేయడం మూలంగా ప్రభుత్వ ప్రయోజనాలకు పంచాయతీ కార్యదర్శులు దూరం కావాల్సి వస్తోంది. ప్రస్తుతం వీరంతా సమ్మె చేపట్టడం మూలంగా ఆయా పంచాయతీల్లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా, ఆసరా పింఛన్లు పంపిణీ, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు, ఇంటి పన్ను వసూలు, ఆడిటింగ్, ఉపాధిహామీ పనుల నిర్వహణ, పల్లె ప్రగతి పనులు, హరితహారం తదితర పనులన్నింటికీ ఆటంకం కలగనుంది.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం : చంద్రశేఖర్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం నిర్దేశించిన నాలుగేండ్ల ప్రొహిబేషన్ పీరియడ్ ఈ నెల 11వ తేదీ నాటికే పూర్తయింది. మరుసటి రోజు నుంచి ఉద్యోగాలను రెగ్యూలర్ చేసి సర్వీసు బుక్‌లో నమోదు చేయాల్సి ఉంది. రెగ్యూలర్ చేస్తామని ఇది వరకు ప్రభుత్వం పలు సందర్భాల్లో హామీనిచ్చినా కాలయాపన చేస్తోంది. ప్రభుత్వం స్పందించి అధికారికంగా జీఓ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగించాలని నిర్ణయించుకున్నాం.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు : శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు వెళ్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని మా శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రత్యామ్నాయ చర్యల గురించి ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. అక్కడ్నుంచి ఆదేశాలు రాగానే అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

రేవంత్‌రెడ్డి విమర్శలు హాస్యాస్పదం : చైర్మన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడి అప్రతిష్టపాలైన రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి గురించి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయంలో అభివృద్ధి చెందిన అంబేద్కర్ కూడలి వద్ద నుండే ఎటువంటి అభివృద్ధి జరగలేదని విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. 25 మంది లబ్దిదారులకు రూ.8,49,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ జిల్లా పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఏళ్లుగా కన్న కలలను సాకారం చేస్తున్నామని స్పష్టం చేశారు. చనాక-కోర్ట ప్రాజెక్టు, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జ్‌ల నిర్మాణాలను చేపడుతున్నామని గుర్తు చేశారు. యాభై సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కనీస అవసరాలను తీర్చలేకపోయిందని, ప్రస్తుతం ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై కేవలం రాజకీయ పబ్బం కోసం మాత్రమే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దాదాపు నాలుగు వేల కోట్ల పై చిలుకు నిధులతో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే జోగురామన్న అభివృద్ధి బాటలో నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కోవ రవి, ఎనుగంటి ప్రకాష్, కుమ్ర రాజు, రాంకుమార్ గుండావర్ సంతోష్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్

పాలిటెక్నిక్ అర్హత పరీక్ష కోసం విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ సూచించారు. డీఆర్సీలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వివిధ విషయాలకు సంబంధించి ప్రశ్నలను అడిగి సమాధానం రాబట్టారు. పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న తర్వాత నేరుగా ఈసెట్ ద్వారా రెండవ సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. అగ్రికల్చరల్ డిప్లొమా కూడా పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులను ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌పై అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ కోచింగ్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కే కాకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, మండల విద్యాశాఖ అధికారి ప్రోగ్రాం కోకన్వీనర్ గడ్డం భిక్షపతి, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ బాబు, ఉపాధ్యాయులు శాంతి కుమార్, సాబీర్, మోహన్ పాల్గొన్నారు.

మహిళ డిగ్రీ కళాశాల హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్



నవతెలంగాణ-నిర్మల్

సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ గురుకుల డిగ్రీ బాలికల హాస్టల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం పూట అక్కడే భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల డిగ్రీ బాలికల హాస్టల్‌లో 470 మంది విద్యార్థులుంటున్నారని, ఈ హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. సమస్యలతో సతమతమవుతూనే విద్యార్థినులు చదువుకుంటున్నారన్నారు. ఒక్కో గదిలో 40 మంది విద్యార్థినులు ఉంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్నతాధికారులు సొంత భవనం నిర్మిస్తామని చెప్పినప్పటికీ అది మాటలకే పరిమితమైందన్నారు. భోజనం, తాగునీరు తగిన నాణ్యతగా లేవని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో కలెక్టర్ చొరవ తీసుకుని తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. లేకపోతే ధర్నాకు పిలుపునిస్తామన్నారు. ఇందులో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, జిల్లా కమిటీ సభ్యులు పరమేశ్వర్, వాణి పాల్గొన్నారు.

11వ రోజు మోకాళ్లపై నిరసన

కాగజ్‌నగర్ : వీఓఏలు చేపడుతున్న సమ్మె గురువారంతో 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిల్చుని తమ నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వివోఏలకు కనీస వేతన రూ.26000 ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎర్రటి ఎండల్లో సమ్మెలో కూర్చున్న వివోఏలకు వడ దెబ్బకు గురైతే బాధ్యత ప్రభుత్వమే వహించాలన్నారు. స్పష్టమైన హామీ ప్రభుత్వం ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్, కళ్యాణి, అంజలి, లలిత, సురేష్, చందు, మోహన్, గీత, శ్రీనివాస్, వనిత పాల్గొన్నారు.



రైతుల రాస్తారోకో

తరుగు పేరిట మోసాన్ని నిరసిస్తూ



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

తరుగు పేరిట రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని రైతులు 63వ జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. వడ్ల కొనుగోలు సెంటర్లలో జరుగుతున్న మోసాలను ఆపాలని, గూడెం లిఫ్ట్ ద్వారా, వడగండ్ల వానల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని అన్నదాతలు ఆందోళన చేపట్టారు. వరి ధాన్యం కొనుగోలులో జాప్యం, తూకానికి సంబంధించిన రశీదులు ఇవ్వకపోవడం, తరుగు పేరుతో తూకంలో మోసాలు ఆపాలని డిమాండ్ చేశారు. అన్నదాతల ఆందోళనకు అఖిలపక్షం నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేస్తామని కొబ్బరికాయలు కొట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా ఇంకా అనేక చోట్ల ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదని, ప్రారంభించిన చాలా చోట్ల రశీదులు ఇవ్వకపోగా, క్వింటాలుకు 5కిలోల చొప్పున తరుగు పేరిట కోత విధించి దోపిడీకి పాల్పడుతున్నారని వాపోయారు. గూడెం లిఫ్ట్ ద్వారా నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతుంటే మరోవైపు దోపిడీతో రైతులను నిలువునా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు ఏర్పాటు చేసి తరుగు లేకుండా తూకం వేయాలని, రశీదు ఇవ్వాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రతిపక్షాలు, అన్నదాతలు డిమాండ్ చేశారు. రాస్తారోకో సుమారు గంట సేపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరమల్ల హరిగోపాల్, బొప్పు సతీష్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో భయాందోళనలు

- తాజాగా కిర్గుల్(బి)లో ఐదు ఇండ్లలో చోరీ

నవతెలంగాణ-బాసర



గ్రామాలలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి కిర్గుల్-బి గ్రామంలో తాళాలు ఉన్న ఇండ్లతోపాటు ఆరు బయట నిద్రిస్తున్న ఇండ్లలో చోరీలు జరిగాయి. బంగారం, డబ్బును దొంగలు దోచుకెళ్లారు. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కిర్గుల్-బి గ్రామంలోని కరెండే గంగన్న తన కూతురు పెళ్లి వచ్చే నెల 7న జరిగే వివాహానికి రూ.50వేల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలను బీరువాలో పెట్టారు. బీరువా తాళాలను పగలగొట్టి వస్తువులను చిందరవందర చేసి 50వేల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. కరెండే బాబు ఇంట్లో 5000 నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. కరెండే గౌతమ్ ఇంట్లో ఎనిమిది వేల నగదు, రెండు మాసాల బంగారం, ఖయ్యూం ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో దుండగుల ఫొటోలు నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు క్లూస్ టీం ద్వారా వేలి ముద్రలు సేకరించారు. దుండగులను త్వరలో పట్టుకుంటామని సిఐ వినోద్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్తగా ఎవరైన వస్తే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గస్తీ తిరగాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో రైతు నోటికాడి ముద్ద లాగేసినట్టయిందన్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతుకు పుట్టెడు శోకం మిగిలిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని వారికీ భరోసా కల్పించాలని కోరారు.

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన తెలంగాణ ఆదర్శ పాఠశాల



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంపిక జాబితాలో మోడల్ స్కూల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా పాఠశాలలకు వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తారన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రత్యేక బోధనా పద్ధతులు అవలంభించి ప్రయోగ ఆధారిత అభ్యసనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందిస్తారని, విద్యార్థులందరికీ నాణ్యమైన, వినూత్నమైన అధునాతన అభ్యాసం అందించబడుతుందన్నారు. పాఠశాలలకు ప్రత్యేక వార్షిక పాఠశాల గ్రాంట్లు అందించబడతాయని, విద్యార్థినులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారని, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయబడతాయని, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేస్తారని తెలిపారు. పాఠశాలకు అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక విధానాన్ని అవలంబిస్తారని, పాఠశాలకు సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఐసిటి సౌకర్యాలు, వొకేషనల్ ల్యాబ్‌లు మొదలైనవి ఏర్పాటు చేయబడతాయని, పాఠశాల ఆవరణలో సోలార్ ప్యానెల్‌లు, ఎల్ఈడి లైట్లు, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, మొక్కల పెంపకం వంటివి చేపట్టి సుందరీకరణ చేసి హరిత పాఠశాలగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంపిక జాబితాలో పాఠశాలకు చోటు దక్కడంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సీటు సాధించిన విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల మద్రాస్ ఐఐటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించిన మనస్వితకు ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ నుండి హెచ్‌పీ ల్యాప్‌ట్యాప్‌ను ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారిణి సునీత కుమారి చేతుల మీదుగా గురువారం మనస్విత తండ్రి చింతల



పురుషోత్తంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లూరి భూమన్న, ప్రధాన కార్యదర్శి బాబన్న, కార్యవర్గ సభ్యులు అర్క దేవిదాస్, బేర శ్రీనివాస్, అయిండ్ల శశికాంత్, నిమ్మల ప్రశాంత్, తోగరి ప్రకాష్, అర్క రమేష్, సూరం భూమన్న, సూరం సుదర్శన్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్(జి) మండలంలోని భూర్గుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై పాకాల గీత తెలిపిన వివరాల ప్రకారం ..భూర్గుపల్లి గ్రామానికి చెందిన జాదవ్ బాలు(36) గత కొన్ని రోజుల నుండి మద్యానికి బానిసై ఏపని చేయకుండా, చెడు వ్యసనాలకు అలవాటు పడి, అప్పులు చేశాడు. మూడు రోజుల కింద అతని భార్య మహారాష్ట్రలోని తన పుట్టింటి దగ్గరలో ఉన్న జగదంబ అమ్మవారి పండగ గురించి తన ముగ్గురు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో గురువారం తెల్లవారు జామున పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య జాదవ్‌జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టామని ఎస్సై తెలిపారు.

వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- నిరవధిక సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు
- మోకాళ్లపై నిలబడి వీఓఏల నిరసన



నవతెలంగాణ-ఖానాపూర్

వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురవారం మండలంలోని ఐకేపీ వీఓఏలు గత తొమ్మిది రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏల సమస్యల పరిష్కారానికి దశలవారిగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. వీఓఏలతో పాటు, మహిళా సమైక్య గ్రూపులు పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులతో కలుపుకొని వీఓఏలు ధర్నాను నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది గత తొమ్మిది రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తుంటే ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్యల పట్ల స్పందించడం లేదని అన్నారు. అనేక సందర్భాలలో సంబంధిత అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమని అన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను గుర్తించాలని అన్నారు. సెర్ప్ నుండి ఐడెంటి కార్డులు ఇవ్వాలని, భీమా సౌకర్యం రూ.10 లక్షలు, వీఓఏలకు అందించాలని అన్నారు. శుక్రవారం మండల కేంద్రాల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మే 1 నాడు మేడే కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. మే 3 తేదీన చలో జిల్లా కలెక్టర్ ధర్నా ర్యాలీ నిర్వహించి, ధర్నా కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, ఐకేపీ వీఓఏల మండల గౌరవ అధ్యక్షులు గంగాధర్, నాయకులు నరేష్, లావణ్య పాల్గొన్నారు.

ఇచ్చోడ:ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలో వీఓఏలు మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. వీరికి బీఎస్పీ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగుబాబు మాట్లాడుతూ వీఓఏలు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 10 రోజులుగా టెంట్లు వేసుకొని సమ్మె చేస్తున్నా, వీఓఏలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఐడెంటి కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత హెచ్‌ఆర్ కల్పించాలని అన్నారు. నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు బరుకుంట సుభాష్, మాధవ్, మారుతి, నికిత, మారుతి, రాహుల్ ధర్మేందర్, పుల్లేడు భీముడు, గంగాధర్, మల్లేష్, నికిత, అనిత, విద్య అనిత పాల్గొన్నారు.

బాసర:ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు పడకండి రమాదేవి అన్నారు. గురువారం మండల ఐకేపీ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న సమ్మెకు బీజేపీ మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో కొన్ని సంవత్సరాలుగా రూ.3వేల 900లు తక్కువ వేతనంతో ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీరికి వేతనం సరిపోతలేదని అన్నారు. కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గంగభూషణ్, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బల్గూరి నర్సింగరావు, టౌన్ అధ్యక్షుడు





సుభాష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు జలంధర్, వీఓఏ లు పాల్గొన్నారు.

సిరికొండ:తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న వీఓఏల నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మోకాళ్లపై కూర్చొని సమ్మె నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు బొడ్డు దత్త్రాత్రి, మంజుల, దేవ్‌రావు, జంగు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద:చాలీచాలని వేతనలతో అల్లాడుతూ ఉద్యోగభద్రత, కనీస సౌకర్యాలు లేక సమ్మె చేస్తున్న వీఓఏలు గురువారం సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో బిక్షాటన చేశారు. ప్రభుత్వం ఇప్పటికైన కండ్లు తెరచి తమ సమస్యలు పరిష్కారించాలని కోరారు. కనీస గౌరవ వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీఓఏలు, బీసీ సంఘ నాయకులు సమ్మెట దశరథ్ పాల్గొన్నారు.

నార్నూర్:ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ విజయ్, మండల అధ్యక్షుడు వాగ్మారే గోవింద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ అధ్వర్యంలో చేపట్టిన నిరవదిక సమ్మెలో పాల్గొని, మోకాళ్లపై కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామ స్థాయిలో 17,605 మంది వీఓఏలు గ్రామ సంఘ సహాయకులుగా పని చేస్తున్నారని అన్నారు. గత 20 సంవత్సరాల నుండి గ్రామాల్లో మహిళా అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నామని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ సమ్మెలో వీఓఏలు శారదబాయి, చిత్రు, తాతేరావ్, దోండుబాయి, పరమేశ్వర్, విద్వాన్, కాంతాబాయి, మాన్కు ఉన్నారు.

డీపీఆర్వోను కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఆదిలాబాద్ డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్‌ను పౌర సంబంధాల సమాచార శాఖలో విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీపీఆర్వోను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సమాచార శాఖలో విష్ణువర్ధన్ తమ ముందు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి, నేడు జిల్లా అధికారిగా పదోన్నతి పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి, అంకితభావంతో విధులు నిర్వర్తించే ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కే.రాజమౌళి, షేక్ రహ్మత్ అలి, ఎం. దేవన్న, జయరాం, రాజన్న పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-కడెం

అకాల వర్షానికి నష్టపోయిన రైతంగానికి నష్ట పరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు కే సర్దార్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో గత వారం రోజుల నుంచి అకాల వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. వడగాండ్లతో కూడిన వర్షాలకు మామిడి, వరి, నువ్వు, మొక్కజొన్న, జొన్నలు, తదితర పంటలు పూర్తిగా నేల రాలి రైతులకు అపారమైన నష్టాన్ని కలుగజేశాయని అన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పోయిన రైతాంగానికి ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. చెల్లించలేని యెడల రైతులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సునారికారి రాజేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, మండల నాయకులు కట్ట గంగాధర్, గంధం నర్సయ్య పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సదస్సులో జిల్లానాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యమ కార్యాచరణ రూపొందించే నిమిత్తమై టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సదస్సుకు ఆదిలాబాద్ జిల్లా నుండి 26 మంది తరలివెళ్లారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సుకు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేఖ ఆధ్వర్యంలో మహిళా బృందం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్న సమాన పనికి సమాన వేతనం, మినిమం బేసిక్ పేరు చెల్లించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆమె అన్నారు. దీని వల్ల కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో సంతోషపడతారని అన్నారు. మినిమం బేసిక్‌పే సాధించే వరకు తమ పోరాటం ఆగదని తెలియజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనురాధ, ఎస్ఓలు ప్రశాంత్‌రెడ్డి, ప్రియాంక, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన చవాన్ శైలజ(30) అనే వివాహితతో పాటు ఆమె కూతురు నందిని(6) బుధవారం అదృశ్యమైనట్లు గురువారం ఎస్సై డి.సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి, కూతుళ్ల అదృశ్యం కావడంతో ఆమె భర్త చవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఉట్నూర్

బడుగు, బలహీన వర్గాల ఆరాధ్యుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల ఒక హోదాలో ఉండి విగ్రహానికి పూలమాలలు వేయకుండా అవమానించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని దళిత సంఘాలు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లీ ప్రజ్ఞాశీల్ అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వచ్చిన రేవంత్‌రెడ్డి వేల ప్రజల సాక్షిగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించకుండా తనను తాను సన్మానించు కొని అంబేద్కర్ విగ్రహానికి కనీసం పిడికెడు పూలతో కూడా నివాళులర్పించకపోవడం కుల దురహంకారానికి నిదర్శనమని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఎంపీగా గెలిచి, అంబేద్కర్‌ని అవమానించిన రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షేమాపణలు చెప్పాలని అన్నారు. రేవంత్‌రెడ్డి బహిరంగ క్షేమపణలు చెప్పని పక్షంలో బాబాసాహెబ్ ఇచ్చిన ఓటు హక్కు ద్వారా డిపాజిట్ రాకుండా ఓడించేది కూడా అంబేద్కర్ వారసులమేనని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి క్షమాపణలు





చెప్పాకుంటే దశల వారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బొంకంటి సుభాష్, కొల్లూరి స్వామి, లక్ష్మిపతి జాడి, దూట మహేందర్, భూమన్న, లక్ష్మణ్, గంగరాజు, కేశవ్, సత్తన్న, రాజన్న ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్:టీపీసీసీ అధ్యక్షుడు రేవంతరెడ్డి అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించకుండా అవమానించారని ఆరోపిస్తూ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మెన్ దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో దళిత సంఘాలు నాయకులు ఆందోళనకు దిగారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో విగ్రహాన్ని నీళ్లతో శుద్ధిచేసి మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. క్రేన్ సాయంతో గజమాల వేసి అంబేద్కర్‌కు ఘనంగా నివాళ్లర్పించారు. రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరుద్యోగ నిరసన ర్యాలీలో భాగంగా భారీ గజమాలతో సత్కరించుకున్న రేవంత్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించకపోవడం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ చర్యపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కనీస గౌరవమివ్వని రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-తాంసి

అకాల వర్షం కారణంగా వివిధ పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని టీపీసీసీ సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. గురువారం మండలంలోని జామిడి, కప్పర్ల గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన నష్టపోయిన పంటలను మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులు పండించిన పత్తిపంట దిగుబడి రాక పోవడంతో పాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుడు నష్టపోయారని, వేసవికాలంలో నైనా జొన్న, మొక్కజొన్న, నువ్వుల పంటలు వేసి ఆ నష్టాన్ని పూడ్చుకుందామని అనుకున్న రైతులకు కన్నీళ్లే మిగిలాయని, గత రెండు రోజులుగా ఈదురు గాలులతో పాటు రాళ్ల వర్షం కురియడంతో చేతికి అందిన పంటలు నేలకొరిగి నష్టపోయారని అన్నారు. నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత వ్యవసాయశాఖ అధికారులతో సర్వే చేయించి, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం రైతులకు అందించాలని అన్నారు. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని అన్నారు. అనంతరం గత వారం రోజులుగా ఐకేపీ



సిబ్బంది చేస్తున్న నరసనకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు సంతోష్, నారాయణ, వినోద్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మీపతి, బుజ్జన్న ఉన్నారు.

రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం : మాజీ మంత్రి

- మాజీ మంత్రి రామచంద్రారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పర్యటనను, నిరుద్యోగుల నిరసన ర్యాలీని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు, ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. అందరి సహాయ సహకారాలతో తమ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభను దిగ్విజయం చేశామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుండి జన సమీకరణ చేశామని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన ఉత్సాహంతో శ్రేణులంతా పనిచేయాలని అన్నారు. అటు సీఎం కేసీఆర్ అనేక హామీలిచ్చి విస్మరించారని మండిపడ్డారు. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో చివరకు సాధించిదేమిటని ప్రశ్నించారు. అలాగే మైనార్టీ రిజర్వేషన్‌ను మొత్తానికి తొలగిస్తామని బీజేపీ నాయకులు చెప్పడం చూస్తుంటే మైనార్టీలపై వారి వైఖరి ఏమిటో స్పష్టమవుతోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మైనార్టీలు ఎవరివైపు ఉంటారో తేల్చుకోవాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 5, 6వ తేదీలలో రాష్ట్ర మహాసభలు ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలు, జీఓ నెం 3రద్దుతో పాటు వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు భద్రాచలం మాజీ ఎంపీ మీడియం బాపురావు, ఎమ్మెల్యేలు పోదెం వీరయ్య, రెగా కాంతారావు ముఖ్యఅతిథులుగా హాజరవుతునట్టు పేర్కొన్నారు. ఈ సభను ఆదివాసులు వివిధ సంఘాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వికలాంగులకు బస్‌పాసులు అందజేత



నవతెలంగాణ-దిలావర్‌పూర్

వికలాంగులకు ప్రత్యేక బస్‌పాసులను గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్మల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో 50శాతం రాయితీ ప్రత్యేక బస్‌పాస్‌లు సర్పంచ్ వీరేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ఆర్టీసీ అధికారులు గ్రామాల్లోకి వచ్చి బస్‌పాస్‌లు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతీ ఒక్కరూ బస్‌పాస్‌ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సుంకరి రమేష్, దాసరి ముత్యం, గోపాల్, కారోబారి రాజు, సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

ఉపాధి హామీ పనులను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని ఫకీర్ నాయక్ తండ గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, కూలీల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-బాసర

ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం ఉదయం మండల పరిధిలోని ఓని గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరియైన ధృవపత్రాలు లేని 88 ద్విచక్ర వాహనాలు స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వినోద్‌రెడ్డి మాట్లాడుతూ వేసవికాలం పల్లెటూర్లలో అనుమానాస్పదంగా ఎవరైనా కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని భద్రతకు సీసీ కెమెరాలు ఎంతోగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో బాసర ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి గిరిజనులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, నరేష్ జాదవ్ పట్ల వ్యవహరించిన తీరును లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాద వెంకట్రావు గురువారం వేర్వేరుగా ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అగ్రకుల అహంకారంతో రేవంత్‌రెడ్డి గిరిజన ప్రజా ప్రతినిధుల పట్ల వ్యవహరించిన తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన ధర్నాకు వచ్చిన నరేష్ జాదవ్‌ను పక్కకు నెట్టివేయడం సరైన విధానం కాదని అన్నారు. నరేష్ జాదవ్ గతంలో రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపీగా పోటీ చేసినటువంటి వ్యక్తికి ఇలాంటి అవమానం జరగడం విచారకరమని అన్నారు. అదిలాబాద్ జిల్లా గిరిజన జిల్లా గిరిజన ప్రజా ప్రతినిధుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. రేవంత్‌రెడ్డి వెంటనే గిరిజనులకు, డాక్టర్ నరేష్ జాదవ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50లక్షల గిరిజన జనాభా ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులను ఎవరు అవమానించిన ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-భీమిని

భారత రాష్ట్ర సమితి 22వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏరియా వర్క్ షాప్‌ను అబ్బాపూర్ ఓపెన్ కాస్ట్ వద్ద తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్ రాజు శ్రీనివాసరావు బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశరావు చర్చల ప్రతినిధి మంగీలాల్ వర్క్ షాపు పిట్ కార్యదర్శి కందుల తిరుపతి, మాజీ వైస్ ప్రెసిడెంట్ నల్లగొండ సదాశివ్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, ఏరియా నాయకులు రాజేశం, అబ్బాపూర్ ఓపెన్ కాస్ట్ ఫిట్ కార్యదర్శి బూర శ్రీనివాస్, ఎంపీ వెంకటేష్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 28 ఏప్రిల్ 2023

ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్‌గా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్



ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్‌గా మాలోతు రాముడు గురువారం నూతన బాధ్యతలు స్వీకరించాడు. ఈ సందర్భంగా గనిలోని మైసమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన గ్రూప్ ఏజెంట్‌ను గని మేనేజర్ సాయిప్రసాద్, గ్రూప్ ఇంజనీర్ రాజా రవి చరణ్, స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రవిశంకర్, ఏరియా సెక్రటరీ అశోక్, సంక్షేమ అధికారి శాంతన్, సర్వే ఆఫీసర్ శ్రీనివాస్, ఆఫీస్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



నవతెలంగాణ-జన్నారం

అకాల వర్షాలకు నష్టపోయిన పంటలపై త్వరగా సర్వే నిర్వహించి నిర్ధారణ చేసి వెంటనే రైతులకు నష్టపరిహారం అందించాలని, తపాలపురం గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి, పీఏసీఎస్ చింతగూడ వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మ అన్నారు. గురువారం మండలంలోని తపాలపురం గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టంపై సర్వే నిర్వహించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారాన్ని అందిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనిత ఏఈఓ సాయి తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో పొనకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీపతి బుచ్చన్న, ఉప సర్పంచ్ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు రాజు మామిడి జగన్ పాల్గొన్నారు.

భగీరథుని ఆలోచనలు అనుసరణీయం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజ హితం కోసం భగీరథ మహర్షి చేసిన ఆలోచనలు అనుసరణీయమని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజహితం, ప్రజల శ్రేయస్సు కొరకు భగీరథ మహర్షి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయులు ఆచరించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి భగీరథునికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ సుంకరి మంగపెంటయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రూప్నర్ రమేష్ పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక లాభం

నవతెలంగాణ-జన్నారం

ఆయిల్ ఫామ్ తోటల సాగుతో రైతులకు అధిక లాభం చేకూరుతుందని ఆయిల్ ఫామ్ పెంపకం రాష్ట్ర కన్సల్టెంట్ నరసింహరావు అన్నారు. గురువారం మండలంలోని దేవునిగూడాలో రైతులు పెంచుతున్న ఆయిల్ ఫామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న తోటలను రైతులు పెంచుకొని అధిక లాభాలు గడించాలన్నారు. రైతులు ఈ పంట సాగు చేయడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు అర్జించవచ్చున్నారు. రైతులకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనిత, సీఈఓ విద్యా కుమార్, హెచ్ఓకే సైలజ, స్థానిక సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్ రెడ్డి, రైతులు బెల్లం బాపురెడ్డి, కళ్యాణ్, తిరుపతిరెడ్డి, ఆకుల రాజన్న పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో కార్మికులకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ మాట్లాడుతూ జిల్లాలో లేబర్ కార్డు ఉన్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మే 1, 2వ తేదీలలో జిల్లా కేంద్రంలో 3వ తేదీన కాగజ్‌నగర్‌లో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 50 రకాల ఆరోగ్య పరీక్షలు ఈ కేంద్రం ద్వారా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కమలాకర్, రామచందర్, ధర్మాయి రవి, దూడల అశోక్, రాజన్న, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

నేటి గల్ఫ్ కార్మిక స్మారక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

అంతర్జాతీ గల్ఫ్ కార్మిక స్మారక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లెడ భూమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటి వరకు 8 సంవత్సరాలు గడుస్తున్న గల్ఫ్ కార్మికుల కోసం చేసింది ఏమీ లేదన్నారు. ఇప్పటివరకు గల్ఫ్ దేశాలలో చనిపోయిన వారి శవపేటికలు 1800కు పైగా రావడం జరిగిందనీ వారి కుటుంబాలను ప్రభుత్వాలే ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో గల్ఫ్ నుండి ఇంటికి తిరిగి వచ్చిన వలస కార్మికులను కనీస అసరా ఇస్తూ వారిని ఆదుకునే అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అంతే కాకుండా వారికి ప్రభుత్వము లోను ద్వారా కొంత సొమ్మును ఇస్తూ వారి జీవనాధారానికి తోడ్పడాలని కోరతున్నమన్నరు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెరుగు మల్లికార్జున్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి హస్సన్, మండల అధ్యక్షుడు పాలాజి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి దుమ్మల్ల ఏలయ్య మెరుగు రావి, శేఖర్, సివనురి శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు వెంటనే

రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వాలి

- జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీఓ ప్రకారం 11 ఏప్రిల్ 2023 నుండి తమ సర్వీసులు రెగ్యులర్ చేయాలని వెంటనే దానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన రెగ్యులర్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో ఇచ్చిన సమ్మె నోటీసు ప్రకారం శుక్రవారం నుండి సమ్మె చేస్తున్నట్లు వెల్లడించారు. సమ్మె తమ హక్కు కాదని ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఆవేదన వినాలనేదే తమ లక్ష్యమని అన్నారు. ఈ ఉద్దేశంతోనే సమ్మె చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓ ప్రకారం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. గత నాలుగు సంవత్సరాల కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను కూడా రెగ్యులర్ కార్యదర్శిగా గుర్తించాలన్నారు. క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారణ చేయడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. 317 జీఓ వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని పరస్పర బదిలీలకు అనుమతించాలన్నారు. నేటి నుంచి చేస్తున్న సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళ్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ



భీమిని : కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తాండూర్ మండల కార్యదర్శులు



ఆసిఫాబాద్‌లో..

కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్‌గౌడ్, కోశాధికారి ప్రదీప్ గౌడ్, గౌరవ అధ్యక్షులు మల్లేష్, రాకేష్, ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, మనీష్, వంశీ, ప్రేమ్ సాగర్, జాయింట్ సెక్రటరీలు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, మారుతి శ్రీజ పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించండి

భీమిని: తాండూర్‌లో క్రమబద్ధీకరణకు ఐబీ చౌరస్తా నుండి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పంచాయతీ అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులని నోటిఫికేషన్‌లో ఇచ్చిన విధంగా గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. గత నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని, అవుట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులందరిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలనికోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, వారి కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలన్న డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని చెప్పి 13 ఏప్రిల్ 2023 రోజున సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రోజుతో సమ్మె నోటీస్ పీరియడ్ ముగుస్తున్నందున ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాని యెడల రేపటినుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, కల్పన, సౌందర్య, క్రాంతి కుమార్, సాయి కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆదాయ పన్ను స్లాబులపై

కార్మికులకు అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్



కొత్త పన్ను, పాత పన్ను స్లాబులపై కార్మికులకు యాజమాన్యం అవగాహన కల్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే న్యూటెక్ గనిలో సీనియర్ నాయకులు గంగాధర చారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక కార్మికులు, ఉద్యోగస్తులు దాచుకునే సేవింగ్స్ పైన కూడా పన్ను వేసేలా కొత్త ఐటీ విధానాన్ని తీసుకొని వచ్చారని దానివల్ల కార్పొరేట్లకే మేలు కలుగుతుందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలు అన్నీ కార్పొరేట్లకు కట్టబెడుతూ కార్మిక చట్టాలు సైతం మార్చి కార్మికులకు సమ్మె హక్కు లేకుండా చేస్తుందని, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విద్యుత్ పరిశ్రమలు సమ్మె చేస్తుంటే కార్మికులను తీసివేసేలా ఆర్డర్లు ఇస్తున్నారని, సమ్మె చేయించిన కార్మిక సంఘం నేతలపై కూడా ఉద్యోగం నుంచి తీసివేసేలా ఉత్తర్వులు ఇవ్వడాన్ని చూస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఒకే విధంగా ఉన్నాయని కార్మికులు ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవాలని కోరారు. అన్ని యూనియన్లు కలిసి లేబర్ కమిషనర్ వద్ద చేసిన ఒప్పందాలను అమలు కోసం యాజమాన్యం ఇంకా ఎందుకు ఉత్తర్వులు విడుదల చేయడం లేదని, దీనికి అడ్డు ఏముందో కార్మిక సంఘాలకు కార్మికులకు యాజమాన్యం తెలపాలన్నారు. ప్రభుత్వ విధానాలు యాజమాన్య విధానాలు కార్మికులు అర్థం చేసుకోవాలని యూనియన్ లను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని తెలిపారు. కార్మికులను సర్ఫేస్‌లో ఉన్నప్పుడు సెల్ ఫోను వాడవద్దని చెప్తున్నా యాజమాన్యం అధికారులకు రూములో భద్రపరచుకున్నట్లుగా కార్మికులకు భద్రపరచుకునేందుకు లాకర్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోతుందో కార్మికులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి డివిజన్ అధ్యక్షులు మిడివెళ్లి శంకర్, డివిజన్ కార్యదర్శి గోదరి భాగ్యరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకులు బోడ కుంట శంకర్, వెంగళ శ్రీనివాస్, ఆర్కే న్యూటెక్ సెక్రటరీ అజయ్, అశోక్ పాల్గొన్నారు.

10వ రోజు కొనసాగిన ప్రజా పోరు యాత్ర



నవతెలంగాణ-వేమనపల్లి

సీపీఐ నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్రను మండలంలోని బుయ్యారం గ్రామంలో గురువారం కొనసాగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి మామిడాల రాజేశం, నియోజక వర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ ప్రారంభించారు. వీరితో పాటు ప్రజా పోరు యాత్ర దళసభ్యులు అందే పురుషోత్తం, బొంతల లక్ష్మీ నారాయణ, గుండ చంద్ర మాణిక్యం, బియ్యాల ఉపేందర్, అడెపు రాజమౌళి, కొంకుల రాజేష్, దెవరబోయిన చిన్న శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీపీఐ చేస్తున్న ప్రజా పోరు యాత్రను ప్రజలు ఆదరించాలని కోరారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, దానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి గోదావరి నీరు అందించాలి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలి, అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు సాలిగామ సంతోష్, పార్టీ ప్రజాసఘాల నాయకులు దేవరబోయిన బాపు, శీలం చంద్రయ్య, రత్నం రాజం, బండారి శంకర్, వినోద్, అందే మహేష్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-వేమనపల్లి

నీల్వాయి-మల్లంపేట ప్రధాన రహదారిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురి కాగా.. వంతెన పక్క నుంచి సొరంగం ఏర్పడడంతో పాటు ఆర్ అండ్ బీ రోడ్డు కూడా సగం మేరకు కూలి ఉంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనదారులు ఇదే వంతెనపై నుండి రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు లోడుతో వెళితే వంతెన కూలే ప్రమాదం ఉంది. సుమారు ముప్పై గ్రామాలకు రాకపోకలు సాఘించి ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ వర్ష కాలం అయిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆర్అండ్ బీ అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు ప్రమాదాల నవారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహనపై రాష్ట్ర డీజీపీ అంజని కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, మొబైల్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్రీత్ అనలైజర్ టెస్ట్ ప్రతిరోజు సాయంత్రం, రాత్రి తప్పకుండా చేయాలని తెలిపారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. రహదారులపై వాహనదారులు ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ సైన్ బోర్డ్‌ను గమనిస్తూ వెళ్ళాలన్నారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమిత వేగంలో వెళ్లాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయనిస్తున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రహదారిపైకి వెళ్ళే సమయంలో, జాతీయ రహదారి క్రాస్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ప్రజలు నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వరరావు, అదనపు ఎస్పీ (ఎఆర్) భీమ్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, డీసీఆర్‌బీ సీఐ పవన్ కుమార్, ఎంటీఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఒకరోజు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.3000 ఇస్తానని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అయినప్పటికీ ఆ మొత్తం నేటికీ అందలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.3000 ఇవ్వడంతో పాటు విద్యార్థికి మెస్ ఛార్జి కింద ఒక్కరికి 25 ఇవ్వాలని కోరారు. వంట సామాన్లు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే ఇవ్వాలని, మినరల్ వాటర్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం నాయకులు ఎండీఎం వర్కర్స్ గిరిజబాయి, ఎస్.రాజు, సావిత్రిబాయి, పద్మ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం కాదు బానిస సమ్మేళనం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు కాదని బానిస సమ్మేళనమని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఆరోపించారు. గురువారం మందమర్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-18 సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి పట్టణ ప్రజలకు మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహిస్తానని ఇచ్చిన హామీని ఎందుకు నిలబెట్టుకోలేదోననీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు ఎండీ షరీఫా, పట్టణ మహిళా ఇన్‌ఛార్జి ఆర్.జయ, పట్టణ అధికార ప్రతినిధి గోలేటి సురేందర్, జిల్లా నాయకులు వాసాల సంపత్, నాయకులు వడ్లాల సత్యనారాయణ, జూపాక సంధ్య, పొడిశెట్టి సువర్ణ, కోడివారి కవిత, వనిత, పసికంటి హరి, పిల్లి శంకర్, రంగనాథ్, రాజేష్, స్వామి పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి నిరసన తెలిపిన వీఓఏలు

నవతెలంగాణ-వేమనపల్లి



దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు డిమాండ్ చేశారు. గురువారం వేమనపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 11వ రోజు సమ్మెలో భాగంగా రోడ్లపై చెత్తను ఊడ్చి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. గత 20 సంవత్సరాల నుండి సంఘాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని, మహిళలకు రుణాలు ఇప్పించి వాళ్ళ అభివృద్ధికి పునాది వేస్తున్నామని అన్నారు. ఆర్థిక అవసరాలు గల సభ్యురాళ్లకు శ్రీనిధి రుణాలు ఇప్పిస్తున్నాం కానీ మాకు ప్రభుత్వం చాలీ చాలని వేతనాలతో పని చేయించుకుంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి మాకు కనీస వేతనం రూ.26000 అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాధారణ ప్రమాద బీమా రూ.10 లక్షలు చేయాలని హెల్త్ కార్డులు గుర్తింపు కార్డులు డ్రెస్ కోడ్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వీఓఏ మండల అధ్యక్షుడు జిల్లపల్లి వెంకటి, కార్యదర్శి పోలంపల్లి మధునయ్య, కోశాధికారి రషీదా పాల్గొన్నారు.

ఆర్కే-6 గనిపై వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

వేసవికాలంలో వడదెబ్బ నివారణ చర్యలపై గురువారం ఆర్‌కే-6 గనిపై హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, జాగ్రత్తలు పాటిస్తూ, వ్యక్తిగత బాధ్యత అత్యవసరమని తెలియజేశారు. ఆల్కహాల్ సేవించడం వల్ల శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి గనుక దూరంగా ఉండాలని చెప్పారు. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం తాగాలని తెలిపారు. తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల లోపే చేయాలని పేర్కొన్నారు. గని మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ డాక్టర్ సలహాలు సూచనలు పాటించాలని, మద్యపానం, ధూమపానం, మాంసాహారం అతిగా తీసుకోకుండా కూరగాయలు, పండ్లకు ప్రాముఖ్యత ఇవ్వాలని, ఎవరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని తెలుసుకొని జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి కాదాసీ శ్రీనివాస్, ఇంజనీర్ మహేష్ డిప్యూటీ మేనేజర్ కొమురయ్య పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత స్థానంలో నూతనంగా జిల్లాకు వచ్చిన ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ విఆర్ఆర్ వరప్రసాద్‌ని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థితిగతులపై, న్యాయస్థానంలో పెండింగ్ కేసులపై ప్రధాన న్యాయమూర్తితో చర్చించారు. అదేవిధంగా నూతనంగా ఎస్సీ ఎస్టీ కోర్టుకు న్యాయమూర్తిగా వచ్చిన పి.శివరాం ప్రసాద్‌ని కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వి.ఉమేందర్, కోర్టు లైసెన్ అధికారి గంగాసింగ్ పాల్గొన్నారు.



కనీస వేతనం అమలు చేయాలి

లక్ష్మణచాంద : కనీస వేతనాల పెంపుదల, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపు అమలు చేయాలని ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో గురువారం వడ్యాల గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం 138వ మే డే పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న మాట్లాడుతూ కార్పొరేటు యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం 44చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులు సమ్మె చేసే హక్కులను కాల రాస్తున్నారని విమర్శించారు. కార్మికుల పని గంటలు పెంచి ఎక్కువ శ్రమ దోపిడీ చేసి యాజమాన్యాలు లాభాలు దండు కోవడానికి పాలకులు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడే వారోత్సవాలను కార్మికులు ఘనంగా జరపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిషన్, సాయన్న, శంకర్, లింగన్న, ఆశన్న పాల్గొన్నారు.



నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- రేపు ప్రవేశపరీక్ష
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగజ్‌నగర్‌లోని ఈ విద్యాలయంలో ప్రతి ఏటా ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తుంటారు. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా ఉండే ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పడుతుంటారు. కేవలం 80 సీట్లకు వేల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో 5,920 మంది విద్యార్థులు

2023-24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 29న ప్రవేశపరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ ప్రవేశపరీక్షకు 5,920 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాను 14 బ్లాక్‌లుగా విభజించారు. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, లక్సెట్టిపేట్, మంచిర్యాల, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూరు (టి), ఉట్నూరు బ్లాక్‌లలో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కనీసం 130కి పైగా, గరిష్టంగా 360 మంది విద్యార్థుల వరకు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష ఈ నెల 29న ఉదయం 11-30 నుండి మధ్యాహ్నం 1-30 వరకు కొనసాగుతుంది. అభ్యర్థులను ఉదయం 11 గంటలకే పరీక్ష హాలులోకి అనుమతిస్తారు. 11-15కు ప్రశ్నాపత్రాన్ని అందిస్తారు. 15 నిమిషాల పాటు ప్రశ్నాపత్రం చదువుకునేందుకు సమయమిస్తారు. 11-30 నుండి అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. 11-30 తర్వాత అభ్యర్థులను పరీక్షా హాలులోకి అనుమతించరు. పరీక్షా హాలులోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష హాలులోకి వచ్చేటపుడు విద్యార్థులు హాల్‌టిక్కెట్, వాటర్ బాటిల్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలి.

గతంలో పరీక్ష రాసిన విద్యార్థులు అఫిడవిట్ అందజేయాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులలో గతేడాది పరీక్ష రాసిన వారు ఎనిమిది మంది ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. నవోదయ విద్యాలయ సమితి నిబంధనల ప్రకారం గతంలో ప్రవేశపరీక్షకు హాజరైన వారు తిరిగి పరీక్ష రాసేందుకు అనర్హులు. ఇటువంటి వారిని ఎనిమిది మందిని గుర్తించిన అధికారులు, వారికి అఫిడవిట్ అవకాశం కల్పించారు. ఆ అఫిడవిట్‌ను ఈ నెల 27లోగా నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్‌కు అందజేయాల్సి ఉంటుంది. వారికి ప్రత్యేకంగా అడ్మిట్ కార్డు ఇస్తారు. ఈ అడ్మిట్ కార్డు ఆధారంగానే వారు పరీక్ష రాయాల్సి ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : బి చక్రపాణి, ప్రిన్సిపాల్



ఈ నెల 29న జరిగే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్లను, పరిశీలకులను నియమించాం. వీరికి కొత్త జిల్లాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల కోసం వివిధ జిల్లా కలెక్టర్‌లకు నివేదించాం. బందోబస్తు కోసం కూడా ఎస్పీలకు తెలియజేశాం. ఆన్‌లైన్ ద్వారా నలుగురు విద్యార్థులు తప్పుగా దరఖాస్తు చేసినట్లు తమ దృష్టికి వచ్చింది. వీరు ఈ పరీక్ష రాసేందుకు అనర్హులు.

ఉమ్మడి జిల్లాలో పరీక్షాకేంద్రాలు, విద్యార్థుల వివరాలు

పరీక్షా కేంద్రం పేరు	విద్యార్థులు
ఆదిలాబాద్ జిల్లా	
చావెరా అకాడమీ, ఆదిలాబాద్	288
ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆదిలాబాద్	230
లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల, ఆదిలాబాద్	288
టీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ (బాలికలు), బోథ్	317
పూలాజీబాబా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఉట్నూరు	255
నిర్మల్ జిల్లా	
ఎస్‌టి థామస్ ఉన్నత పాఠశాల, నిర్మల్	336
విజయ ఉన్నత పాఠశాల, మంజులాపూర్	168
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుమ్మేరాత్‌పేట్, నిర్మల్	173
ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాల, కళాశాల, భైంసా	240
వేదం ఉన్నత పాఠశాల, భైంసా	240
వాసవి ఉన్నత పాఠశాల, భైంసా	213
వాసవి ఉన్నత పాఠశాల, నిర్మల్	219
మంచిర్యాల జిల్లా	
ట్రినిటి ఉన్నత పాఠశాల, లక్సెట్టిపేట్	240
ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, లక్సెట్టిపేట్	179
కార్మెల్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల	288
ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మంచిర్యాల	208
పభుత్వ ఉన్నత పాఠశాల, చెన్నూరు	165
టీఎస్ మోడల్ స్కూల్, మందమర్రి	138
ఎస్టీ మేరి ఉన్నత పాఠశాల, బెల్లంపల్లి	308
కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా	
ఎస్‌టి మేరీ ఉన్నత పాఠశాల, ఆసిఫాబాద్	360
తెలంగాణ మోడల్ ఉన్నత పాఠశాల, ఆసిఫాబాద్	283
జవహర్ నవోదయ విద్యాలయం, కాగజ్‌నగర్	240
ఎస్‌టి క్లారెట్ ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్	207
టీఎస్‌డబ్ల్యుఆర్ఆర్‌జెసీ (బాలికలు), సిర్పూర్(టి)	337

అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోషకాహారం అందరికీ అందజేసి సేవలు అందిస్తున్న అంగన్వాడీలు కార్మికులేనని సుప్రీం కోర్టు పేర్కొందని తెలిపారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 45, 46 సమావేశాల్లో అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కర్నాటకలో అంగన్వాడీలు చేసిన ఉద్యమంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను కార్మికులుగా గుర్తిస్తామని, గ్రాట్యుటీ చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ విధంగానే తెలంగాణలోనూ అమలు చేయాలన్నారు. ఇందులో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, జిల్లా కార్యదర్శి లలిత, జిల్లా సహాయ కార్యదర్శి భాగ్యలక్ష్మి పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని ఖాళీ బిందెలతో నిరసన



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో 15 రోజుల నుండి తాగునీటి సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నామని గురువారం గ్రామస్తులు ఖాళీ ంబిదెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. 15 రోజుల నుండి గ్రామంలో మంచినీటి సరఫరా లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు తెలిపారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని అడిగితే రేపు మాపు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎండాకాలం కావడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉందని, ఈ పరిస్థితిలో వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఒకే ఒక బోర్‌వెల్ ఉందని, ముఖ్యంగా రెండో వార్డులో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తులుంటే, బోర్‌వెల్ పట్ల కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు సిద్ధంగా ఉన్నామన్నారు.

హరితహారానికి మొక్కలు పెంచాలి



నవతెలంగాణ - కౌటాల

వచ్చే ఆర్థిక సంవత్సరానికి నర్సరీల్లో మొక్కలను పెంచాలని కాగజ్‌నగర్ డీఎల్‌పీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించి వచ్చే సంవత్సరం హరితహారానికి మొక్కల కొరత లేకుండా నర్సరీల్లో మొక్కలు పెరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్‌లో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని, గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధిహామీ, శ్మశానవాటిక పనులు, అందులోని వసతులు, పల్లె ప్రకృతివనంలో చెట్లను ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ ఆదె శ్రీనివాస్, ఉప సర్పంచ్ వెంకటేశ్, ఎంపీఓ మౌనిక, కార్యదర్శి సాయికృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్(పీఅండ్‌పీ) పర్యటన

నవతెలంగాణ - రెబ్బెన

డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జి వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి ఖైరిగూడ ఓసీని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. పావురాల గుట్ట వద్ద జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. రాన్ను ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలపై అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి మార్గానిర్దేశం చేశారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమలరావు, పీఓ ఉమాకాంత్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

- వీఓఏల రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు రమ
- నిర్మల్‌లో భిక్షాటన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.రమ పునరుద్ఘటించారు. కలెక్టరేట్ ఎదుట ఐకెపి వివోఎల సమ్మె 11వ రోజుకు చేరిన సందర్భంగా ఆమె సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వివోఏలు ప్రభుత్వ పథకాల అమలులో ఎంతగానో పనిచేస్తున్నారని, అయినప్పటికీ గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలన్నారు. విఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయించకుడదన్నారు. అర్హులైన వివోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని,



సమస్యలు పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, నాయకులు కృష్ణమాచారి, ఐకెపి వివోఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్ధి, కార్యదర్శి రమా, సునీత, వినోద్, గణేష్, కల్పన, శ్రీలత, అర్చన పాల్గొన్నారు.



నిర్మల్ : కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం 9వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు భిక్షాటన చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న మాట్లాడారు. తమ డిమాండ్ల సాధన కోసం దశల వారీగా పోరాటం చేస్తున్నామన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి నెల వేతనాలను నిర్ణయించి, బ్యాంక్ అకౌంట్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. వీవోఏల పనిభారాన్ని పెంచి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీవోఏలు పోశెట్టి, గాయత్రి, సింధు, స్రవంతి, సునీత, రజిని లక్ష్మి, గోదావరి, కవిత పాల్గొన్నారు.

కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు : ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 30న జరిగే కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, ఆబ్జర్వర్లు, బయోమెట్రిక్ నిర్వహణ సిబ్బందితో గురువారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేసి, పరీక్షను సజావుగా నిర్వహించే విధంగా, తుది రాత పరీక్షలో ఏ ఒక్క చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా అధికారులను సూచనలు జారీ చేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్ తుది రాత పరీక్ష 12 పరీక్షా కేంద్రాలలో 4824 అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల గుర్తింపు కొరకు బయోమెట్రిక్ పద్ధతిలో వేలి ముద్రలు తీసుకోవడం జరుగుతుందని, అందుకు వీలుగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి 8.45 గంటలకు రావాలని సూచించారు. 10 తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోనికి అనుమతించరన్నారు. హాల్ టికెట్ వెనుక ఉన్న నిబంధనలు అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు చదువుకోవాలని తెలిపారు.



పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, సి.సమైజాన్ రావు, బి రాములు నాయక్, పరీక్ష రీజనల్ కోఆర్డినేటర్లు జగ్రామ్ అంతర్వేది, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌లో పూలే, అంబేద్కర్ జన జాతర



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశ సామాజిక విప్లవానికి సారధులుగా నిలిచిన మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా మనువాద పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా హరించబడుతున్న రాజ్యాంగ హక్కులను రక్షించుకోవడానికి ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో పూలే అంబేద్కర్ జనజాతర నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర సర్కార్ అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం ద్వారా బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లను సమాధి చేస్తుందన్నారు. బీసీ ప్రధాని అని గప్పాలు కొట్టిన బిజెపి నాయకులు ఎందుకు బీసీ కుల గణన చేపట్టడడం లేదని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులు, మహిళలపై ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మూడు రెట్లు దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు పెరిగాయన్నారు. మనువాద ఎజెండాతో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన చేస్తున్న బిజెపి మనువాద కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదలపై పెనుబారాలు మోపుతోందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమం చేపడతామన్నారు. సామాజిక, ప్రజా సంఘాలు, మేధావులు పూలే అంబేద్కర్ జన జాతరలో పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జాడి మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, ఉట్ల రవి, నితిన్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలకు ఎమ్మెల్యేదే బాధ్యత



నవతెలంగాణ-లక్సెట్టిపేట్


ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తరుగు పేరిట జరుగుతున్న అక్రమాలకు ఎమ్మెల్యే దివాకర్‌రావుదే బాధ్యత అని బిజెపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు అండగా బిజెపి నాయకులు ఉంటారన్నారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. కొనుగోలు పేరుతో రైతుల వద్ద బస్తాకు రెండు కిలోలు అదనంగా కాంటా పట్టి రైస్ మిల్లర్లతో ఎమ్మెల్యే కుమ్మక్కై రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరగడం లేదని చెబుతున్న ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్లు దోచుకుని భూనిర్వాసితులకు మాత్రం ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ముంపు గ్రామాలకు ఎమ్మెల్యే వెళ్తే ప్రజలు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు వీరమళ్ల హరిగోపాల్, నాయకులు బొప్పు కిషన్, గుండ ప్రభాకర్, శ్రీదేవి, మధు, గంగన్న, సతీష్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

29న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



కౌటాల : మాలీ సంఘం వ్యవస్థాపకులు వడాయి నారాయణ సాగర్ విగ్రహావిష్కరణ కార్యాక్రమాన్ని 29న విజయవంతం చేయాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు అన్నారు. మాలీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 29న నవెగాం గ్రామంలో వడాయి నారాయణ సాగర్ విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి మాలీ కులస్తులు, విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాలీ కులస్తులను ఎస్‌టీ జాబితాలో చేర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా మాలీ కులస్తులు ఏకతాటిపైకి వచ్చి ఐక్యతను చాటాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆదె శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు సెండె నాందేవ్, ఆదె బాపురావు, గణేష్, భీంరావు, పాండురంగ్, మొర్లె నాగేష్, మోతీలాల్, శంకర్, గంగారాం, సతీష్, భీంరావు, నారాయణ ఉన్నారు.

గొర్రెల పెంపకందారులకు అవగాహనా సదస్సు



లక్ష్మణచాంద : రెండవ విడత గొర్రెల పెంపకందారులకు గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహనా సదస్సు నిర్వహించినారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి అన్నారు. లబ్ధిదారులు కష్టపడి పనిచేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ సూచించారు. యాదవుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిదని యాదవ సంఘ నాయకులు మేకల రాజేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, వెటర్నరీ వైద్యులు అజయ్, సిబ్బంది, యాదవ సంఘ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు హైకోర్ట్ జడ్జీలు రాక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 29న శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.సుధీర్ కుమార్, ఎం.ప్రియదర్శిని హాజరవుతారని అధ్యక్ష కార్యదర్శులు చంద్రమోహన్, చంద్రకాంత్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఆదేశాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రస్తుత వాతావరణం దృష్ట్యా తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి సీఎం కేసీఆర్ గురువారం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో స్పందించిన మంత్రి ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో ప్రధానంగా మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉందని తెలిపారు. దళారుల చేతుల్లో మోసం జరుగకుండా రైతులకు ప్రభుత్వం మద్దతు ధరతో క్వింటాలుకు. రూ.1962 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల మండల రైతుల హర్షం వ్యక్తం చేశారు.

నేడు డిగ్రీ కళాశాలలో జేఎల్, డీఎల్ పరీక్షలపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటల జేఎల్, డీఎల్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అనుభవజ్ఞులైన, అధ్యాపకులచే జనరల్ స్టడీస్, వివిధ సబ్జెక్టులలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జాగ్‌రామ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీఏఓల దీక్షా శిబిరాన్ని సందర్శించిన నాయకులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో సిఐటియు అధ్వర్యంలో ఐకేపి వీఏఓల తొమ్మిది రోజులుగా చేస్తున్న నిరవధిక దీక్ష శిబిరాన్ని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు, బతుకమ్మ చీరల పంపిణీ, ఉపాధి హామీ, కంటి వెలుగు వంటి అన్ని రకాల సర్వేలతో పాటు ప్రభుత్వం వీఓఏలతో వెట్టి చాకిరీ పనులు చేయించుకుంటోందని తెలిపారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని తెలిపారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌ను గద్దె దించాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మోసపూరిత హామీలకు మోసపోకుండా జాగ్రత వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, దేవేందర్, అరవింద్, గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు కంటి పరీక్షలు చేయించుకోవాలి

- మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్‌రెడ్డి వంటి ప్రతిపక్ష నాయకులు కంటివెలుగు శిబిరాల్లో కంటి పరిక్షలు చేయించుకోవాల్సిన అవసరముందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి చేస్తున్న కంటి పరీక్షలతో పాటు కళ్ళద్దాలు, మందుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ అంధత్వ నివారనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షలు జరిగిన అనంతరం అవసరమైన కండ్లద్దాలను ఉచితంగా అందచేస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్న నాయకులు కంటి వెలుగు శిబిరాల్లో పరీక్షించుకుని కంటి చూపు సరిచేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంకుమార్, అశోక్, గంగారెడ్డి, సురేందర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం

నవతెలంగాణ-ఖానాపూర్



కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మికులందరూ పోరాడాలని, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. ఖానాపూర్ మండల కేంద్రంలోనీ విద్యానగర్‌లో గురువారం 138వ మేడేకు సంబంధించిన, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గానికి నేడు అందుతున్న వేతనాలతో జీవనం గడపడం కష్టంగా మారిందని అన్నారు. అనేక రంగాల కార్మికులకు నెలకు ఐదువేల నుండి పదివేలలోపు వేతనాలు గలవారు మాత్రమే అధికంగా ఉన్నారని అన్నారు. నిజ జీవితాలకు సరిపడా కనీస వేతనాలు, సామాజిక భద్రత, కల్పించాలని పనిగంటల తగ్గింపుకై, ఉద్యమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మాలనుకునే ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధికరించాలని కోరారు. కార్మికులందరూ మేడేను విజయవంతంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, మోహన్, నాగోరావు, మునావర్ సుభాష్, గోనె లచ్చన్న పాల్గొన్నారు.

అంబలి ఆరోగ్యానికి మేలు : శ్యామ్‌నాయక్



నవతెలంగాణ-కడెం

అంబలి ఆరోగ్యానికి మంచిదని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షులు అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. గురవారం మండల కేంద్రంలో స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షులు శ్యామ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సర్పంచ్ బొడ్డు గంగన్న జన్మదిన సందర్భంగా కేక్‌కట్ చేసి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, ఆత్మ కమిటీ చైర్మెన్ సతీష్, దిల్దార్‌నగర్ సర్పంచ్ విజయ స్టీఫెన్, ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ రాష్ట్ర నాయకులు కిషన్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎండి హసీబ్, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని గురవారం ఎంపీపీ గంద్రత్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రొబిషన్ కాలం ముగిసినందున తమను రెగ్యులర్ చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో అమలు చేస్తు ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ, పని చేసిన కాలనీ ప్రొబిషన్‌గా గుర్తించి, వారిని కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన జేపీఎస్, ఓపీఎస్‌ల కుటుంబాలను ఆదుకుని ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించి, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

'అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందడం లేదు'



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందడం లేదని మాజీ ఎంపీ, బీజేపీ జిల్లా నాయకుడు రాథోడ్ రమేష్ ఆరోపించారు. గురువారం మండలంలోని లక్షెటిపేట్ గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, బీజేపీ జిల్లా నాయకుడు రమేష్ రాథోడ్ పాల్గొని, ఇంటింటికీ వెళ్లి గిరిజనులతో మాట్లాడారు. బీజేపీ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై ప్రజలను చైతన్య పరిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న భాదితులను పరామర్శించారు. బీజేపీ ప్రభుత్వం పేదలందరికి అండగా ఉంటోందని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి పెరిగిపోయి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

విలేకరిని పరామర్శించిన సత్యనారాయణగౌడ్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని కనాకాపుర్ గ్రామానికి చెందిన విలేకరి కొరుకొప్పుల రాజాగౌడ్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు సత్యనారాయణగౌడ్ గురువారం పరామర్శించారు. రాజాగౌడ్ తల్లి కొరుకొప్పుల లక్ష్మి ఈ నెల 24న మరణించింది. విషయం తెలుసుకున్న ఆయన కనకాపూర్ గ్రామానికి వచ్చి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు మేకల రాజేంధర్ యాదవ్, ముత్తన్న యాదవ్, శంకర్, హనుమాగౌడ్ ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం

నవతెలంగాణ-బేల

ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే దత్తత గ్రామమైన మండలం దహేగాం గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం చేపట్టి ఏండ్లు గడుస్తున్న స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల వినియోగంలోకి రాలేదని అన్నారు. గ్రామంలో నూతనంగా రోడ్డు వేసి, డ్రైనేజీ నిర్మాణం చేపట్టక పోవడం వల్ల నీరు ఇండ్లలోకి చేరుతుందని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీలో లబ్ధిదారులు తమ స్వంత డబ్బులతో గొర్రెలు తీసుకున్నారని అన్నారు. కానీ ఇప్పటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమచేయలేదని అన్నారు. వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షులు దత్తా నిక్కం, మురళీదర్ ఠా క్రే, గణేష్ బోంగిర్‌వార్, విజయ్ వాంఖడే, విఠల్, శివకుమార్, ప్రమోద్ రెడ్డి, అశోక్ రెడ్డి, కాంత, భాగ్యలక్ష్మి, రాము, సతీష్‌రెడ్డి, శివకిరణ్‌రెడ్డి ఉన్నారు.

బీడీ కార్మికులకు ప్రతిరోజూ పని కల్పించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

బీడీ కార్మికులకు ప్రతిరోజూ పని కల్పించాలని భారత సంఘాల సమైక్య నాయకులు రామ్‌లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని చించోలి-బిలో బీడీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మే డేను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. బీడీ కార్మికులతో పాటు బీడీ కంపెనీ యజమానులకు బీడీ కమీషన్‌ను పెంచాలన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నెలలో 25 రోజులు పని కల్పిస్తూ కూలీ పెంచాలన్నారు. అనంతరం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు, బీడీ కంపెనీ యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.